సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



పోషకాహారంతో ఆరోగ్యం

పోషకాహార లోప నివారణ, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించడానికి ఈ నెల 12 నుంచి అక్టోబరు 11 వరకు రాష్ట్రీయ పోషణ్ మాహ్‌ను ప్రారంభిస్తున్నారు. 8లో ▸



న్యాయం గెలిచింది

యాసిడ్ దాడి కేసులో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ముగ్గురు నిందితులకు రెండు జీవిత ఖైదులతోపాటు మరో 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 8లో ▸



మళ్లీ పెరుగుతున్న గోదావరి

గత రెండు రోజులుగా గోదావరి వరద ప్రవాహం తగ్గినట్టే తగ్గి మరలా పెరుగుతోంది. బుధవారం సాయంత్రం భద్రాచలం వద్ద 42.10 అడుగులకు చేరుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

జలజీవన్ మిషన్‌పై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్-జల జీవన్ మిషన్ అమలు, నిర్వహణపై బుధవారం ఢిల్లీ నుంచి కేంద్ర సెక్రటరీ రాష్ట్రంలోని కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. జల జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా జిల్లాలో జరుగుతున్న పనులకు సంబంధించి కలెక్టర్ వివరించారు.

జిల్లా కేంద్రంపై వైఖరి స్పష్టం చేయాలి

భీమవరం: జిల్లా కేంద్రం ఏర్పాటుపై కూటమి పార్టీల నాయకుల వైఖరి ఏంటని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మూడేళ్ల క్రితం నాటి కలెక్టరేట్ వ్యవహారం అంశాన్ని అధికార పార్టీల నాయకులు ఎందుకు వివాదం చేస్తున్నారని గోపాలన్ ప్రశ్నించారు. ఒక్కో పార్టీ నాయకుడు ఒక్కో చోట, ఒక్కో మాట చెప్పి ప్రజలను మభ్య పెట్టడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి పాలనలో ఇంకా అనేక వాగ్దానాలు అమలు చేయాల్సి ఉండగా వాటి అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని హామీల అమలుకోసం ఆందోళనలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి వివాదాస్పద అంశాలను సృష్టిస్తున్నారనే అనుమానం వ్యక్తమవుతుందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక



జీపీసీ శేఖర్‌రాజు

భీమవరం: పట్టణంలోని చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాల్లో పీఈటీగా పనిచేస్తున్న గొట్టుముక్కల పూర్ణ చంద్ర శేఖరరాజు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 27 ఏళ్లుగా ఆయన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. 2008లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. 2011లో ఆంధ్రా యూనివర్సిటీ ఉత్తమ పీఈటీ అవార్డును అందించింది.

వేంద్ర పాఠశాల ఉపాధ్యాయుడికి అవార్డు



పంపన సాయిబాబు

వీరవాసరం: వేంద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 1985లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా తొలిసారి బాధ్యతలు స్వీకరించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, ఆంధ్ర బుక్ ఆఫ్ రికార్డ్, భారత్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత తీసుకోవాలంటూ కవితలు, గేయాలు రాసి ప్రజలను చైతన్యపర్చారు.

పాస్ పుస్తకాలను సిద్ధం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీకి సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ చాంబర్ నుంచి వివిధ రెవెన్యూ అంశాలపై జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి పట్టాదార్ పాస్ పుస్తకాలను తనిఖీ చేసి ఫోటోలు, తప్పులు ఉన్న పాస్ పుస్తకాలు సవరించి పంపిణీకి సిద్ధం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.

జిల్లా రవాణా అధికారిగా కృష్ణారావు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా రవాణా అధికారిగా కె.ఎస్.ఎం.వి.కృష్ణారావు పదవీ బాధ్యతలు చేపట్టారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణారావు ఏలూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇంతకుముందు డీటీఓగా పనిచేసిన ఉమామహేశ్వరరావు గత నెల 31న పదవీ విరమణ చేశారు.

సాంఘిక సంక్షేమ అధికారిణిగా అరుణ్ కుమారి


భీమవరం: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణిగా ఎస్.వి.అరుణ్ కుమారి నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా కొండెపిలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారిగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చారు.

స్మార్ట్ పరేషాన్

కూటమి ప్రభుత్వం కొత్తగా అందిస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డులు ఇంకా ఇవ్వకపోవడంతో చాలా మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పాత రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కొందరికే అందడంతో తమ కార్డు ఉందో లేదోనని లబ్ధిదారులు ఎదురుస్తున్నారు.



- మందకొడిగా స్మార్ట్ కార్డుల పంపిణీ..
- గందరగోళంలో లబ్ధిదారులు
- కొందరికే అందడంతో ఆందోళన
- పంపిణీలో పర్యవేక్షణ లోపం



తణుకు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు విడతల్లో స్మార్ట్ కార్డుల పంపిణీలో భాగంగా మొదటి దఫాలో గత నెల 25 నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో స్మార్ట్ కార్డుల పంపిణీని కూటమి నేతలు అట్టహాసంగా మొదలుపెట్టారు. మొదట ఎమ్మెల్యేలు, ఆ తరువాత వార్డు నాయకులు ఈ స్మార్ట్ కార్డుల పంపిణీలో భాగంగా లబ్ధిదారులతో ఫొటోలు తీసుకుని సోషల్ మీడియాలో విస్తతంగా ప్రచారం చేసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా స్మార్ట్ కార్డులు పంపిణీ మాత్రం మందకొడిగా సాగుతుండడంతో తమ కార్డు ఉందో తెలియని స్థితిలో లబ్ధిదారులు ఉన్నారు. ఒక ఇంటికి స్మార్ట్ కార్డు ఇవ్వగా, పక్కనే ఉన్న మరో ఇంట్లో కార్డు అందకపోవడంతో లబ్ధిదారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రచారం చేసుకున్నంత వేగంగా కార్డులు పంపిణీ చేయకపోవడంతో ఏర్పడిన గందరగోళంలో లబ్ధిదారులు చౌక డిపోలు, గ్రామ, వార్డు సచివాలయాలు, తహసీల్దారు కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. రేషన్ కార్డులో ఉన్న నంబరు ప్రకారం ఆయా రేషన్ డిపోల్లో ఇస్తారని అధికారులు చెబుతుండడంతో ఆ నంబరు రేషన్ డిపోల వద్దకు వెళ్లేందుకు లబ్ధిదారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

స్మార్ట్ కార్డుల గందరగోళం : స్మార్ట్ కార్డులు ఇంటి గుమ్మంలోకి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంటి గుమ్మంలోకి కార్డులు రాకపోవడంతో లబ్ధిదారులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు. గతనెల 31 వరకు సచివాలయాల్లో కార్డులు ఉన్నప్పటికీ కార్డులు అందజేయడంలో సంబంధిత సిబ్బంది విఫలమయ్యారు. సచివాలయాలకు వస్తున్న లబ్ధిదారులకు కార్డులు రేషన్‌డిపోల వద్ద ఉన్నాయని సచివాలయ సెక్రటరీలు చెబుతున్నారు. ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ఏదోక రకంగా ఇబ్బందులు వస్తున్నాయని, ఇప్పటికే దివ్యాంగ పింఛన్లలో అధిక శాతం అనర్హులుగా చూపించారని ఈ కార్డులు కూడా ఏమవుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకంలోను రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకునే పరిస్థితుల్లో స్మార్ట్ కార్డులు అందకపోతే ఎలా అని తలపట్టుకుంటున్నారు. లబ్ధిదారులకు బయో మెట్రిక్ వేలిముద్ర, ఫేస్, ఐరిస్, ఆధార్ ఓటీపీ ఆప్షన్‌లలో ఒక దానిని ఎంచుకుని స్మార్ట్ కార్డు అందచేయాలి.

తలపట్టుకుంటున్న రేషన్ డీలర్లు

స్మార్ట్ రేషన్ కార్డులు రేషన్ డీలర్లు ఇవ్వాలని అధికారులు చెబుతున్నారని అయితే రేషన్ సరుకులే ఇవ్వాలా, కార్డులు వెతుక్కుని కార్డులే ఇవ్వాలా అని రేషన్ డీలర్లు తలపట్టుకుంటున్నారు. ఇప్పటికే రేషన్ కోసం లబ్ధిదారులు క్యూలో ఉంటున్నారని, స్మార్ట్ కార్డులు కూడా ఇవ్వాలంటే చాలా ఇబ్బందిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

20 శాతం కూడా పంపిణీ చేయని వైనం

పశ్చిమగోదావరి జిల్లాలో గతనెల 25న కార్డుల పంపిణీ ప్రారంభించగా జిల్లాలో 5,61,408 రేషన్ కార్డులకు గాను 1,10,599 కార్డులు మాత్రమే బుధవారం సాయంత్రానికి పంపిణీ చేశారు. ఇంకా 4,50,809 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో గతనెల 30 నుంచి కార్డుల పంపిణీ ప్రారంభించగా 6,25,666 కార్డులకు 80,583 కార్డులు మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన 5,45,083 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది.

కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నాం



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గందరగోళంగా ఉంది. కొంతమందికి ఇస్తుండగా, మరికొందరికి ఇవ్వకపోవడంతో గందరగోళంగా మారింది. సచివాలయాలు, రేషన్ డిపోల చుట్టూ తిరగలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్డులు ఎక్కడ ఇస్తారనే సమాచారం కూడా అధికారులు ఇవ్వడంలేదు.

– ఉండవల్లి సురేష్, మండపాక

గతంలో అన్ని సేవలు ఇంటికే..

గత ప్రభుత్వ హయాంలో సంక్షేమానికి సంబంధించిన అన్ని సేవలు ఇంటి గుమ్మంలోకే అందించేవారు. వలంటీర్లు ఇంటి గడపలోకి వెళ్లి దరఖాస్తులు సేకరించడంతోపాటు తిరిగి ధ్రువ పత్రాలను ఇంటికెళ్లి అందజేసేవారు. దీంతో ఎలాంటి జాప్యం లేకుండా గంటల వ్యవధిలోనే ప్రతి సేవ ఇంటికి చేరేది. స్మార్ట్ కార్డు పంపిణీకి సంబంధించి గతనెల 25న ప్రారంభించి పది రోజులు గడిచినా ఇంతవరకు జిల్లాలో 20 శాతం కూడా కార్డులు పంపిణీ చేయలేని దుస్థితి. ఇంటికెళ్లి కార్డులు పంపిణీ చేయాలని కొన్ని మున్సిపాలిటీల్లో కమిషనర్లు ఆదేశాలిస్తున్నా కొందరు సెక్రటరీలు ఆయా సచివాలయాలకు రావాల్సిందేనని చెబుతున్నారు. సచివాలయాలకు వెళ్లినా సదరు సీటులో సంబంధిత సెక్రటరీ ఉండకపోవడం, ఫీల్డుకు వెళ్లారనే సమాధానాలతో లబ్ధిదారులకు చిర్రెత్తుకొస్తుంది. ఒకవేళ వృద్ధులు వెళ్లలేని స్థితిలో ఉండి వారి తరపున ఎవరైనా వెళ్లినా ఆధార్ ఓటీపీ ద్వారా ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ లబ్ధిదారులు రావాల్సిందేనని గుర్రుగా చెబుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇళ్లకే పరిమితమైన వృద్ధులు, వికలాంగులు సైతం స్మార్ట్ కార్డుల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక కార్డు కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

కామిరెడ్డికి మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్

దెందులూరు: ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నానిపై జరిగిన దాడిని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. బుధవారం సాయంత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కామిరెడ్డి నానికి ఫోన్ చేశారు. జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేశారా? పార్టీ న్యాయ విభాగం సహాయ సహకారాలు అందిస్తుందా? అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనపై జరిగిన దాడి వివరాలను నాని వివరించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ చెప్పారు.

రాజకీయాలు హుందాగా చేయాలి

కామిరెడ్డి నానిపై దాడి బాధాకరమని పలువురు పేర్కొన్నారు. రాజకీయాల్లో సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు సరైన విధానం కాదని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు

చిచ్చుపెడతారా ?



ప్రశాంత వాతావరణంలో టీడీపీ శ్రేణులు చిచ్చు పెడతారా? కామిరెడ్డి నానిపై దాడి దుర్మార్గం. దాడులు, అక్రమ కేసులు పెట్టి ఏం చేయాలని సంకేతాలు ఇస్తున్నారు. ఎందుకు ఈ విధానాన్ని అవలంభిస్తున్నారు. గత ఐదేళ్లలో శిలాఫలకాలు, హోర్డింగులు మేం ధ్వంసం చేశామా? పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– కారుమూరి సునీల్ కుమార్ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్

అభివృద్ధిలో పోటీపడాలి



ప్రజలు అధికారం ఇచ్చింది అభివృద్ధి, సంక్షేమం చేసి సమస్యలు పరిష్కరించాలని కానీ దాడులు, కొట్లాటలు చేయడానికి కాదు. ఇలాంటి చర్యలు సరికాదు. గతంలో ఎప్పుడు ఈ పరిస్థితులు లేవు. ఈ ఘటనపై పోలీసులు స్పందించాలి. బాధితులపై చర్యలు తీసుకోవాలి.

– కొఠారు అబ్బయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే

ఇద్దరు సీఐలకు పదోన్నతులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలోని ఎనిమిది మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు రేంజ్ పరిధిలో ఇద్దరు సీఐలు పదోన్నతులు పొందారు. ఏలూరు రేంజ్‌లోని పీ శ్రీనివాస్, పీ ఈశ్వరుడు డీఎస్పీలుగా పదోన్నతి పొందారు.

రైతు కష్టాలపై వైఎస్సార్‌సీపీ పోరుబాట

ఏలూరు టౌన్: రాష్ట్రంలో రైతుల కష్టాలు వర్ణణాతీతంగా మారాయి.. ఆఖరికి యూరియా సరఫరా చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. గత ఐదేళ్లు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతులకు వ్యవసాయం పండుగలా సాగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పీఏసీ సభ్యులు, ఉంగుటూరు, నూజివీడు, చింతలపూడి సమన్వయకర్తలు పుప్పాల వాసుబాబు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కంభం విజయరాజు, ఉమ్మడి జిల్లా జోనల్ మహిళా విభాగం అధ్యక్షురాలు మాకినీడి శేషుకుమారి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 9న అన్ని ఆర్డీవో కార్యాలయాల వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపి వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. ఏలూరు, కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాలకు సంబంధించి ఏలూరులో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లోని రైతులతో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద, నూజివీడు నియోజకవర్గంలోని రైతులతో నూజివీడు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేస్తారన్నారు.

సర్వీస్ రోడ్ల కోసం రాస్తారోకో



గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

టి.నరసాపురం: టి.నరసాపురం మండల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్కేందుకు దిగేందుకు సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ఇవ్వాల్సిందేనని భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో టి.నరసాపురం వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. నిర్వాసిత రైతుల సమస్యల పరిశీలనకు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, హైవే అధికారులు, రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా టి.నరసాపురం, గురువాయిగూడెం, ఏపుగుంట, మధ్యాహ్నపువారి గూడెం, వెంకటాపురం, బొర్రంపాలెం తదితర గ్రామాల వద్ద భూ నిర్వాసిత రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. సమస్యలు రైతులు చెప్పడంతో నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని చెప్పారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, రైతు పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ, వెదుళ్ళ నాగేశ్వరరావు, లింగారెడ్డి శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బొంతు మురళి తదితరులు మాట్లాడుతూ సర్వీస్ రోడ్లు గ్రావెల్ రోడ్లుగా నిర్మించి ఇస్తామన్న హామీలు అమలు చేయకపోవడం వల్ల తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సర్వీస్ రోడ్డు మట్టి రోడ్డు కావడంతో దిగుబడిపోయి నానా తంటాలు పడాల్సి వస్తోందన్నారు. సర్వీస్ రోడ్ లో మొక్కలు వేయవద్దని డిమాండ్ చేశారు. టి.నరసాపురం 112వ అండర్ పాస్ వద్ద సర్వీస్ రోడ్ గుండా వెళ్లే అవకాశం లేకుండా పోయిందన్నారు.

మా గొంతెండుతుంటే నాన్ లేఅవుట్‌కు నీళ్లా?

- మున్సిపాలిటీ నీటి కోసం పంచాయతీ తీర్మానం చేయించిన డిప్యూటీ స్పీకర్
- పట్టించుకోని ఎమ్మెల్యే అంజిబాబు
- జేసీని పక్కదోవ పట్టించిన అధికారులు


భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ప్రజలు మంచినీటి సమస్యతో సతమతం అవుతుంటే పక్కా నియోజకవర్గంలోని నాన్ లేవుట్‌కు మున్సిపాలిటీ నీళ్ల తరలింపు వివాదాస్పదంగా మారింది. ఉన్నత అధికారులను మున్సిపాలిటీ సిబ్బంది పక్కదోవ పట్టించి తీర్మానం చేయించి నీళ్లను ఉండి నియోజకవర్గంలోని విస్సాకోడేరులోని పవన్ సుధ నాన్ లేవుట్‌కు పైపులైన్ వేసి మరి సరఫరా చేస్తున్నారు. లేవుట్‌లో మొత్తం 50 కుటుంబాలు ఉండగా ఫీజు కట్టిన 32 మంది లబ్ధిదారులకు నీళ్ల సరఫరా జరుగుతోంది.

నాన్ లేవుట్‌కు పైపులైన్ తీర్మానం సూచించిన రఘురామకృష్ణరాజు

పవన్ సుధా నాన్ లేవుట్‌కు విస్సాకోడేరు పంచాయతీ నుంచి మంచినీటి పైపులైన్ వేయడం, నీటి సరఫరాకు రూ.20 లక్షలు ఖర్చవుతుందని, అది సాధ్యం కాదని పంచాయతీ తీర్మానంలో పేర్కొన్నారు. భీమవరం మున్సిపాలిటీ నుంచి నీళ్లు సరఫరా చేసే పైపులైన్ నుంచి పవన్ సుధా లేవుట్ ఆర్చి వరకు పైపులైన్ వేయాలని ఉండి ఎమ్మెల్యే సూచించనట్లు పంచాయతీ తీర్మానంలో పేర్కొని భీమవరం మున్సిపల్ కమిషనర్‌కు తీర్మానం కాపీ పంపించారు. ఈ తీర్మానంలోనే పంచాయతీ నాన్ లేవుట్ అని రాశారు. అలాంటి నాన్ లేవుట్‌కు ఉండి ఎమ్మెల్యే నీటి సౌకర్యం కల్పించమని ఎలా సిఫార్సు చేస్తారని ప్రశ్నిస్తున్నారు.



భీమవరం మున్సిపాలిటీ నుంచి నీటి సరఫరాకు పైప్‌లైన్



GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT DEPARTMENT

- The beneficiaries must pay double the municipal donation charges.
- They must also pay double the municipal water charges.

S SURESH KUMAR IAS
PRINCIPAL SECRETARY

//FORWARDED BY ORDER//
SECTION OFFICER

నీళ్లు సరఫరా చేయాలంటూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల ఆర్డర్

ప్రిన్సిపాల్ సెక్రటరీ నుంచి అర్డర్

నాన్ లేవుట్‌కు మున్సిపాలిటి నీళ్లు సరఫరా చేయడానికి ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. భీమవరం మున్సిపల్ కమిషనర్‌కు ఆర్డర్ జారీ చేయించడంలో ఉండి ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించారని ఆరోపణలు ఉన్నాయి.

అనుమతులు లేవు

నాన్ లేవుట్‌కు నీటి సరఫరాకు మున్సిపల్ అధికారులు నిబంధనల ప్రకారం పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ నుంచి అనుమతులు తీసుకోలేదు. ఇదే విషయంపై పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారి విజయ్‌ను వివరణ కోరగా తమ డిపార్ట్‌మెంట్ నుంచి పవన్ సుధా ఎన్‌క్లేవ్‌కు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్, వాటర్ సరఫరా విభాగం అధికారులు చెబుతున్నారు.

జేసీని తప్పుదోవ పట్టించారు

మున్సిపాలిటీ నీటి సరఫరాపై కౌన్సిల్ తీర్మానం పంపించే క్రమంలో మున్సిపాలిటి ప్రత్యేక అధికారిగా జాయింట్ కలెక్టర్‌ను మున్సిపల్ అధికారులు తప్పుదోవ పట్టించారు. తీర్మానంలో ఎక్కడ కూడా నాన్ లేవుట్ అని పేర్కొకుండా లేవుట్ ఆర్చి వరకు పైపులైన్‌ను ఉండి ఎమ్మెల్యే పంచాయతీ తీర్మానంలో సూచించినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోరు

భీమవరం పట్టణంలో మంచినీటి సమస్య ఉంది. అలాంటిది పక్క నియోజవర్గంలోని ఒక నాన్‌లేవుట్‌కు మున్సిపాలిటీ నీటి సరఫరా చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. చివరి ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్న విషయం ఎమ్మెల్యే అంజిబాబుకు తెలుసు. వేసవిలో రెండు పూటల నీటి సరఫరా కష్టం అవుతుందని తెలిసి కూడా నాన్‌లేవుట్‌కు మున్సిపాలిటీ నీటి సరఫరాకు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నిస్తున్నారు.

మండిపడుతున్న పట్టణ వాసులు

పక్క నియోజవర్గంలోని నాన్ లేవుట్‌కు సరఫరా చేయడంపై భీమవరం పట్టణ వాసులు మండిపడుతున్నారు. భీమవరంలో పైపులైన్ ఉన్న కొన్ని ప్రాంతాలకు నీళ్లు రావు. చివ రిప్రాంతాలకు నీళ్లు అందవు. అలాంటిది భీమవరం నీళ్లను అక్రమ లేవుట్‌లకు సరఫరా చేయడం దారుణం అంటున్నారు.

అక్రమ లేఅవుట్‌కు మున్సిపల్ పైప్‌లైన్

వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం

భీమవరం: భీమవరం పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించకుండా పక్క నియోజకవర్గంలోని అక్రమ లేఅవుట్‌లోని ఇళ్లకు మునిసిపాలిటీ నుంచి మంచినీటి సరఫరా చేయడం వెనుక అవినీతి భాగోతం ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. విస్సాకోడేరు గ్రామంలో అక్రమంగా వేసిన పవన్ సుధ లేఅవుట్‌కు మునిసిపల్ వాటర్ సరఫరా చేయడాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో తీవ్రంగా ఖండించారు. పట్టణంలో మంచినీటి సరఫరా జరగడం లేదని శివారు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతుంటే.. అక్రమ లేఅవుట్‌కు నీటి సరఫరాకు పది అంగుళాల పైప్ లైన్ వేయడం అన్యాయమన్నారు. విస్సాకోడేరు పంచాయతీ నుంచి మంచినీటి పైప్‌లైన్‌కు దరఖాస్తు చేయగా అక్రమ లేఅవుట్ అంటూ నిరాకరించారని తెలిపారు. అయితే మునిసిపాల్టీ నుంచి ఎవరి ప్రయోజనాలకోసం ప్రత్యేక పైప్‌లైన్ వేశారని దీనికి వెనుక అవినీతి చోటుచేసుకుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని నాగేశ్వరరావు అన్నారు. విస్సాకోడేరు లేఅవుట్‌కు నీరు ఇవ్వడం వల్ల పట్టణంలోని మారుతీనగర్, కముజువారిపాలెం, బొక్కావారి పాలెం, నెహ్రూకాలనీ తదితర ప్రాంతాలకు మరింత మంచినీటి ఇబ్బందులు ఏర్పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పేరిచర్ల సత్యనారాయణరాజు, గాదిరాజు రామరాజు, కోడే యుగంధర్, పాలవెల్లి మంగ, సుంకర బాబూరావు మాట్లాడుతూ గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలుండగా మునిసిపాల్టీ నుంచి పైప్‌లైన్ ఇవ్వడానికి సమాధానం ఇవ్వాలన్నారు. మునిసిపల్ అధికారులు ఏ అధికారంతో పైప్‌లైన్ వేశారని నిలదీశారు.విస్సాకోడేరులో లేఅవుట్ ప్రాంతానికి ఇచ్చిన పైప్‌లైన్‌పై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పైప్‌లైన్ వేసిన ప్రాంతాన్ని సందర్శించి ఆందోళన నిర్వహించారు.



అక్రమ లేఅవుట్‌కు పైప్‌లైన్ వేసిన ప్రాంతాన్ని చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


దువ్వలో ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తణుకు అర్బన్ : తణుకు మండలంలోని దువ్వ గ్రామంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. తనిఖీల్లో దుకాణాల్లో ఎరువులకు సంబంధించి రిజిస్టరులో ఉన్న గణాంకాలకు గ్రౌండ్ బ్యాలెన్స్‌లో 17 బస్తాల యూరియా వ్యత్యాసం ఉండటంతో 1.395 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్‌చేసి దుకాణదారుడిపై 6ఏ కేసు నమోదు చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏవో జి. మీరయ్య, విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, వ్యవసాయాధికారి కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

యూరియా సమస్య లేదు

ఏలూరు(మెట్రో): జిల్లాలో యూరియా సరఫరా విషయంలో ఎలాంటి సమస్య లేదని, యూరియా సమృద్ధిగా ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26లో ఇప్పటివరకు 28 వేల టన్నులు సరఫరా చేశామని, రాబోయే 3 నెలల్లో మిగిలిన 3 వేల మెట్రిక్ టన్నులు కూడా త్వరితగతిన అందుబాటులోకి వస్తాయన్నారు.

కాణిపాకం వినాయకుడికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న శ్రీవారి దేవస్థానం, కాణిపాకం దేవస్థానం ఈఓల దంపతులు

ద్వారకాతిరుమల: కాణిపాకంలో జరుగుతున్న స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చినవెంకన్న దేవస్థానం తరఫున ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి దంపతులు బుధవారం గణేషుడికి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా శ్రీవారి దేవస్థానం అర్చకులు, పండితులు, ఈఓ దంపతులు కాణిపాకం ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడి దేవస్థానం ఈఓ కిషోర్ దంపతులతో కలసి, సత్యన్నారాయణ మూర్తి దంపతులు అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ పూలు, పండ్లు, పట్టువస్త్రాలను శిరస్సుపై పెట్టుకుని తీసుకెళ్లి వరసిద్ధి వినాయకుడికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రమణరాజు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు తదితరులున్నారు.

పోషకాహారం.. ఆరోగ్యానికి అనుసంధానం

- పోషణ్ అభియాన్ – మిషన్ పోషణ్ 2.0
- ఈనెల 12 నుంచి అక్టోబరు 11 వరకు కార్యక్రమాలు
- 5 అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సమావేశాలు

కై కలూరు: పోషకాహారలోప నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి అక్టోబరు 11 వరకు 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ – 2025ను ప్రారంభించనున్నారు. పోషణ్ అభియాన్–మిషన్ పోషణ్ 2.0 పేరుతో నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను జిల్లాలో అమలు చేయనున్నారు. ఊబకాయం, చక్కెర, నూనె వినియోగం తగ్గించడం, బాల్య సంరక్షణ, తల్లి పేరు మీద ఒక చెట్టు, శిశువులు, చిన్న పిల్లలకు ఆహారం పెట్టడం, పోషకాహార సంరక్షణలో పురుషులు పాల్గొనడం వంటి 5 కార్యక్రమాలను అధికారులు అమలు చేయనున్నారు.

ఏలూరు జిల్లాలో 10 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2,225 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. గర్భిణులు 8,314 మంది ఉండగా వీరిలో 695 మందికి రక్తహీనత(ఎనిమియా) ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా జిల్లాలో 3–6 ఏళ్ల చిన్నారులు 49,048 ఉండగా, బాలామృతం తీసుకునే పిల్లలు 48,563 మంది ఉన్నారు. వీరిలో వయసుకు తగ్గ ఎత్తు లేని చిన్నారులు 14,281 మంది, ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలు 4,141 మంది, వయసుకు తగిన బరువు లేని చిన్నారులు 6,705 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇక బాలింతలు 5,758 ఉన్నారు. మహిళలు, పిల్లల్లో ఐరన్, అయోడిన్, విటమిన్ 'ఏ' లోపాలను సరిచేయడానికి మిషన్ పోషణ్ 2.0లో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు.


కైకలూరు మండలం గోపవరంలో అంగన్‌వాడీ కేంద్రం


ప్రతి ఒక్కరికీ పోషకమైన ఆహారం

ఆదాయం, సామాజిక స్థితికి సంబంధం లేకుండా అందరికీ ఆరోగ్యకర ఆహారం అందుబాటులో ఉండాలని ప్రతి ఏటా సెప్టెంబరులో జాతీయ పోషకాహార వారోత్సవాలను 1982 నుంచి జరుపుతున్నారు. ప్రభుత్వం వీటిని నెల రోజుల పాటు నిర్వహిస్తుంది. ఏలూరు జిల్లాలో 16,37,418 మంది జనాభాలో 2,16,284 మందికి రక్తపోటు, 1,71,505 మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించారు. కోవిడ్–19 తదనంతర పరిస్థితుల్లో పోషకాహారం మరింతగా తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ పోషకాహార వినియోగంపై సూచనలు అందిస్తోంది. విటమిన్ 'ఏ' లేకపోవడం వల్ల మన దేశంలో ఏటా 30 వేల మంది కంటి చూపును కోల్పోతున్నారని అధ్యాయనాలు చెబుతున్నాయి. ఊబకాయం వల్ల టైప్ –2 డయాబెటీస్, ఫ్యాటీ లివర్ వ్యాధి, పిత్తాశయంలో రాళ్లు, కీళ్ల రుగ్మతలు, రక్తపోటు, కేన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయి. వీటి నివారణకు సరైన పోషకాహార వినియోగంపై అధికారులు అవగాహన కలిగించనున్నారు.

షెడ్యూల్ ఇలా..

జిల్లా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నెల రోజులు జరిగే పోషకాహార కార్యక్రమాల్లో ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ పాలుపంచుకోనున్నాయి. షెడ్యూల్ విషయానికి వస్తే ఈనెల 12 నుంచి 25 వరకు ఊబకాయం, నూనె, చక్కరలు తగ్గించుకోవడం, ఈనెల 18 నుంచి 30 వరకు పోషణ్ బీ పఢైబీ(పీబీపీబీ)పై అవగాహన, ఈనెల 12 నుంచి అక్టోబరు 11 వరకు ఒక చెట్టు పేరు, పర్యావరణం, ఈనెల 26 నుంచి అక్టోబరు 2 వరకు శిశువులు, చిన్న పిల్లలకు ఆహారం అందించడం, అక్టోబరు 3 నుంచి 11 వరకు పురుషులను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

ఇవి తప్పక పాటించండి



- పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, ఫైబర్ కలిగినవి తీసుకోవాలి.
- రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల రక్తపోటు, గుండె జబ్బుల నుంచి రక్షణ పొందవచ్చు.
- పుట్టిన నాటి నుంచి 6 నెలల వయస్సు వరకు పిల్లలకు తల్లిపాలు మాత్రమే అందించాలి. 2 సంవత్సరాల పైనే తల్లి పాలు బిడ్డకు కొనసాగించవచ్చు.
- స్నాక్స్, చక్కెర, కొవ్వులు, ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవద్దు.
- చేపలు, గుడ్లు, పాలు, మాంసం, కూరగాయలు, పండ్లు సమపాళ్లలో తీసుకోవాలి. కూరగాయలు, పండ్లను ఎక్కువగా ఉడికిస్తే విటమిన్లు కోల్పోతాయి.
- ప్రతి రోజూ వ్యాయామం, నడక, యోగాసానాలు అలవర్చుకోవాలి.
- బలహీనంగా ఉన్న పిల్లలకు ప్రత్యేక పోషకాహారం అందించాలి.

పోషకాహారంపై అవగాహన



జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈనెల 12 నుంచి అక్టోబరు 11 వరకు పోషణ్ అభియాన్ – మిషన్ పోషణ్ 2.0 పై అవగాహన కలిగిస్తాం. ఇప్పటికే పోషకాహార లోపం కలిగిన వారిని గుర్తించాం. మహిళలు, చిన్నారులకు పోషకాహారంపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కలిగించాలి. వివిధ శాఖలతో సమన్వయంతో పనిచేయాలి.

– పి.శారద, ఐసీడీఎస్, జిల్లా, పీడీ, ఏలూరు

పిల్లలపై ప్రభావం



పోషకాహారం లోపాన్ని ప్రారంభంలోనే గుర్తించాలి. పిల్లలు ఎత్తుకు తగిన బరువు, బరువు తగిన ఎత్తు లేకపోతే వ్యాధి నిరోధక శక్తి వారిలో తగ్గుతుంది. ఏకాగ్రత లోపిస్తోంది. ఇటువంటి వారిని గుర్తించి అంగన్‌వాడీ సెంటర్లలో ప్రత్యేక ఆహారం అందిస్తున్నారు. పోషకాహార విలువల ఆహారాన్ని బిడ్డలకు అందించాలి.

– డాక్టర్ కె.అన్నపూర్ణ, పీహెచ్‌సీ, శీతనపల్లి

మళ్లీ పెరుగుతున్న గోదావరి

కుక్కునూరు: గత రెండు రోజులుగా గోదావరి వరద ప్రవాహం తగ్గినట్టే తగ్గి మరలా పెరుగుతోంది. బుధవారం సాయంత్రం భద్రాచలం వద్ద 8 లక్షల క్యూసెక్కుల వరదతో 42.10 అడుగులకు చేరుకుంది. 43 అడుగులకు వరద ప్రవాహం చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేయనున్నారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడం వలన అటు గోదావరి, ఇటు శబరీ నదులతో విలీన మండలాల్లో వరద తీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని విలీన మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈసారి వరద తీవ్రత ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోలవరంలో స్వల్పంగా తగ్గుతూ...

పోలవరం రూరల్: గోదావరి వరద స్వల్పంగా తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి కొండవాగుల నీరు నదిలోకి చేరుతుండటంతో వరద ప్రవాహం కొనసాగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 32 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 8.62 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. దిగువన వరద ఉధృతంగానే ప్రవహిస్తోంది. పట్టిసం శివక్షేత్రం చుట్టూ వరద నీరు తాకుతూ ప్రవహిస్తోంది. భద్రాచం వద్ద 48.80 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి నీరు చేరడంతో ప్రవాహం ఒకే విధంగా కొనసాగుతోంది.


పట్టిసం శివక్షేత్రం వద్ద గోదావరి వరద

కృష్ణా కాలువలో గుర్తుతెలియని మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు వసంత్‌మహల్ సెంటర్ సమీపంలోని కృష్ణా కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై మధు వెంకటరాజా సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. మృతుడి ఒంటిపై చొక్కా లేదనీ, ప్యాంటు మాత్రమే ధరించి ఉన్నాడని చెబుతున్నారు. రెండు, మూడు రోజులుగా కృష్ణా కాలువలో నీటిప్రవాహం అధికంగా ఉండడంతో కాలువలో జారిపడి కొట్టుకుని వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. మృతుడి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నట్లు ఎస్సై మధు వెంకటరాజా తెలిపారు.

మరోసారి న్యాయం గెలిచింది

- యాసిడ్ దాడి కేసులో ముగ్గురు ముద్దాయిలకు కఠిన శిక్షలు
- రెండు జీవిత ఖైదులు, పదేళ్ల కఠిన కారాగారం, జరిమానా


యాసిడ్ దాడి కేసులో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు, పీపీ శారదమణి

ఏలూరు టౌన్: రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన యాసిడ్ దాడి కేసులో మరోసారి ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పును వెలువరించింది. ముగ్గురు ముద్దాయిలకు రెండు జీవిత ఖైదులతో పాటు మరో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, యాసిడ్ విక్రయించిన వ్యక్తికి జరిమానా విధించగా, మరో ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 2023లో ప్రత్యేక న్యాయస్థానంలో నిందితులకు శిక్షలు విధించగా, హైకోర్టును ఆశ్రయించి, తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆ తీర్పును రద్దు చేస్తూ మరోసారి ట్రయల్ నిర్వహించాలని ఆదేశించింది. రెండవ సారి క్షుణ్ణంగా సాక్ష్యాధారాలను, సాక్షులను విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ కేసు వివరాలను వెల్లడించారు.

అసలేం జరిగిందంటే...

ఏలూరు విద్యానగర్‌లో యడ్ల ఫ్రాన్సినా అనే మహిళ జూన్ 13 తేదీ 2023న రాత్రి 9గంటల సమయంలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆమెపై యాసిడ్ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా పోలీస్ అధికారులు కృషితో నిందితులను 48 గంటల్లోపే పట్టుకున్నారు. ఏలూరు కొత్తగూడెంకు చెందిన బోడ నాగసతీష్, అతని స్నేహితులు ఏలూరు వైఎస్సార్ కాలనీకి చెందిన బెహర మోహన్, బూడిద ఉషాకిరణ్‌ను అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. యాసిడ్ కొనుగోలు చేసేందుకు సహకరించిన షేక్ కాజ్‌బాబు, యాసిడ్ విక్రయించిన కొల్లా త్రివిక్రమరావు, అతని వద్ద పనిచేస్తున్న వీడెలా సత్యనారాయణపైనా కేసు నమోదు చేశారు. ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, అప్పటి జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి కేసును పరుగులు పెట్టించి నిందితులకు కేవలం మూడు నెలల వ్యవధిలోనే కఠిన శిక్ష విధించేలా చర్యలు చేపట్టారు. ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. యాసిడ్ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులకు రెండు జీవిత ఖైదులు విధించగా, ఏ5 నిందితుడికి జరిమానా విధించారు. తీర్పును సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా మరోసారి ట్రయల్ నిర్వహించారు.

మరోసారి సంచలన తీర్పు

రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో ట్రయల్ నిర్వహించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మరోసారి బుధవారం సంచలన తీర్పును వెలువరించారు. ఏ1 నుంచి ఏ3 వరకూ నిందితులైన బోడ నాగసతీష్, బెహర మోహన్, బూడిద ఉషాకిరణ్‌కు రెండు జీవిత ఖైదులతోపాటు, 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించారు. ఏ5 నిందితుడు కొల్లా త్రివిక్రమరావుకు రూ.1500 జరిమానా, రూ.50 వేలు బాధితురాలి కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఏ4, ఏ6 నిందితులు షేక్ కాజాబాబు, వీడెలా సత్యనారాయణపై నేరం రుజువు కాలేదని, నిర్దోషులుగా ప్రకటించారు.

మృతురాలికి న్యాయం చేసే లక్ష్యంతో...

రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో స్పెషల్ జడ్జి ఫర్ ట్రయల్ ఆఫ్ కేసెస్ అండర్ ఎస్సీ, ఎస్టీ యాక్ట్, అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తి మరోసారి ట్రయల్ నిర్వహించారు. సాక్షులను విచారించగా, పూర్తిస్థాయిలో సాక్ష్యాధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్పీ శివకిషోర్ కోర్టు మానిటరింగ్ సెల్‌కు సూచనలు చేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.శారదమణి తనదైన శైలిలో వాదనలు వినిపించారు. మృతురాలికి న్యాయం చేసే లక్ష్యంతో పనిచేసిన పోలీసులందరినీ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ

ద్వారకాతిరుమల: మీ బైక్ చక్రం బోల్టు ఊడిపోతోంది.. ఆపండి చూద్దాం.. అంటూ ఇద్దరు యువకులు బైక్‌పై వెళుతున్న ఒక వ్యాపారిని నమ్మించారు. బైక్ ఆపి చూస్తుండగా సినీ ఫక్కీలో ఆ వ్యాపారి జేబులోని సెల్‌ఫోన్‌ను తస్కరించారు. ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనపై బాధితుడు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే. ద్వారకాతిరుమలకు చెందిన ఫ్యాన్సీ షాపు వ్యాపారి కోరుప్రోలు సత్యన్నారాయణ వస్తువుల కొనుగోలు నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం తన బైక్‌పై ఏలూరు వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు, సార్.. మీ బైక్ చక్రం బోల్టు లూజయ్యి ఊడిపోయేటట్టు ఉంది, చూద్దాం ఆపండని అన్నారు. అది నమ్మిన సత్యన్నారాయణ బైక్ ఆపాడు. దాంతో ఆ యువకులు సైతం తమ బైక్ ఆపగా, అందులో ఒక యువకుడు బైక్ దిగి వ్యాపారి వద్దకు వచ్చాడు. చక్రం తిప్పండి చూద్దాం అనడంతో వ్యాపారి కాస్త ఒంగాడు. అంతే సినీ ఫక్కీల్లో ఘరానా మోసగాడైన ఆ యువకుడు వ్యాపారి జేబులోని సెల్‌ఫోన్‌ను లాక్కుని బైక్‌పై పరారయ్యాడు. సదరు వ్యాపారి వారిని పట్టుకునేందుకు వెంబడించినా ఫలితం దక్కలేదు. దీనిపై వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

ముదినేపల్లి రూరల్: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబరుచుకుని మోసం చేసిన యువకుడిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని చేవూరుకు చెందిన యువతి 2020లో పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి గుడివాడలోని కళాశాలకు వెళ్లింది. అదే సమయంలో ప్రవేశం కోసం అక్కడికి వచ్చిన జంగారెడ్డిగూడెం మండలం కొయ్యలగూడెంకు చెందిన అంజూరి దివాకర్‌తో పరిచయం పెరిగింది. అది కాస్తా ప్రేమగా మారడంతో వివాహం చేసుకుంటానని నమ్మించి దివాకర్ ఆ యువతిని శారీరకంగా లోబరుచుకున్నాడు. అనంతరం వివాహం చేసుకోమని పలుమార్లు కోరినప్పటికీ అతడు తిరస్కరించాడు. దీనిపై పెద్దల సమక్షంలో పెట్టినా దివాకర్ తిరస్కరించి మోసం చేసినట్లు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు

భీమవరం: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ కె మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 14వ తేదీ వరకు జిల్లాలోని ఆవు, గేదె జాతి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నాలుగు నెలలు నిండిన పశువులన్నింటికీ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. గాలికుంటువ్యాధి కారణంగా పాల ఉత్పత్తి, పనిసామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. వ్యాధిసోకిన పశువుల పాలు తాగిన లేగ దూడలు మరణించే అవకాశముందన్నారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి సొంగ కారడం, నోరు, కాలు గిట్టల మధ్య పుండ్లు, చూడిపశువులు ఈసుకుపోవడం వంటి లక్షణాలు కన్పించినపుడు సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం వహిస్తే పశువులు చనిపోయే ప్రమాదముందన్నారు. పశువులన్నింటికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలని మురళీకృష్ణ వివరించారు.

ఉన్నత విద్యకు, ఉద్యోగాలకు గేట్ స్కోర్ కీలకం


సెమినార్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ ఫ్యాకల్టీ మణిమోహన్ త్రినాథ్

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ తృతీయ, ఆఖరి సంవత్సరం విద్యార్థులకు గేట్–2026 పరీక్షపై బుధవారం స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ కాంపిటేటివ్ ఎగ్జామ్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ప్రసిద్ధ కోచింగ్ సంస్థ ఏస్ ఇంజనీరింగ్ అకాడమీకి చెందిన సీనియర్ ఫ్యాకల్టీ ఎస్ మణిమోహన్ త్రినాథ్ వక్తగా పాల్గొని పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. గేట్ పరీక్ష నిర్మాణం, సిలబస్, దానివల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉన్నత విద్యకు, అలాగే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు గేట్ స్కోర్ ఎంతో కీలకమని అవగాహన కల్పించారు. గేట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఆరో తేదీన బ్రాంచి వారీగా మాక్ పరీక్షను నిర్వహిస్తామన్నారు. దీని ద్వారా విద్యార్థులు తమ సన్నద్ధత స్థాయిని అంచనా వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ డీన్ అకడమిక్స్ దువ్వూరి శ్రావణి, ఈఐటీపీ డీన్ పీ శ్యామ్, డీన్ అకడమిక్స్ సాదు చిరంజీవి, సెంట్రల్ కోఆర్డినేటర్‌లు ఎం.రామకృష్ణ, వై ప్రియాంక పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనం క్యూలైన్లలో పాము కలకలం


హతమైన తాచు పామును దూరంగా తరలిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయంలో బుధవారం తాచు పాము కలకలం రేపింది. మధ్యాహ్నం 1 గంట సమయంలో స్వామివారి మహా నివేదన నిమిత్తం దర్శనాన్ని నిలుపుదల చేశారు. ఆ సమయంలో ఉత్తరం వైపు ఉన్న దర్శనం క్యూలైన్లలోకి ఒక పెద్ద తాచు పాము ప్రవేశించింది. దర్శనం నిలుపుదల కావడంతో క్యూలైన్లలో భక్తులెవరూ లేరు. దాంతో పెనుప్రమాదం తప్పింది. సెక్యూరిటీ సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న దేవస్థానం అధికారులు అక్కడికి చేరుకుని, గార్డెన్ సిబ్బందితో ఆ పామును చంపించారు. అనంతరం దాన్ని దూరంగా తీసుకెళ్లి పడేశారు.

హీల్ విద్యార్థులకు జాతీయస్థాయిలో పతకాలు


జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన హీల్ విద్యార్థులు

ఆగిరిపల్లి: జాతీయస్థాయిలో నిర్వహించిన పారా అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని తోటపల్లికి చెందిన హీల్ పాఠశాల అంధ విద్యార్థులు పతకాలు సాధించారు. ఆగస్టు 29 నుంచి 31 వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో 14వ జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో హీల్ పాఠశాలకు చెందిన అంధ విద్యార్థులు జూనియర్స్ విభాగంలో జాలా వరలక్ష్మి డిస్కస్ త్రోలో బంగారు పతాకం, లాంగ్ జంప్‌లో రజిత పతకం, చింతల ప్రవీణ్ పరుగు పందెం పోటీల్లో రజిత పతకం, సబ్ జూనియర్ విభాగంలో హరి లాంగ్ జంప్ , పరుగు పందెం పోటీల్లో రజిత పతకం, రోహిత్ జావాలిన్ త్రోలో రజిత పతకం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యార్లగడ్డ లతా చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మిక్కిలినేని హరీష్, అంధ పాఠశాల ఇన్‌చార్జి కే అబ్రహం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

కొయ్యలగూడెం: రామానుజపురం గ్రామంలో ఉరి వేసుకుని ఒక వ్యక్తి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలీగా వ్యవసాయ జీవనం సాగిస్తున్న అడపా జీయన్న(55) తన డాబా ఇంటిపై ఎలివేషన్‌కి ఉన్న ఊసలకు ఉరి వేసుకుని ఉండగా కుటుంబీకులు గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. మృతుడికి భార్య, కుమారుడు, కోడలు, కమార్తె ఉన్నారు.

క్లుప్తంగా

శ్రీకృష్ణపరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణపరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీకృష్ణ పరమాత్మకు బుధవారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఆలయ అర్చకులచే పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామి వారికి వకుళమాలలు, పుష్పమాలలు సమర్పించారు. పట్టు వస్త్రాలతో విశేష అలంకరణ జరిగింది. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు. భక్తులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా విద్యార్థులు, రోగులకు విలువైన సేవలు అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు కడించర్ల రాజరాజేశ్వరరావు అన్నారు. తణుకు గమిని ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తణుకులోని ఒక కళాశాలలో చదువుతున్న విద్యార్థి చిత్రాడ మధు రిశ్వంత్‌కు రూ. 5వేలు, కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఆలచంద్ర వెంకటేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5వేలు ఆర్థికసాయంగా అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, బి.రామకాశీ, ఆనందం మస్తాన్ రావు, అక్కిన కాశీ, డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు, ఆలపాటి సుబ్బారావు, ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, బోడపాటి ప్రసాద్, పులమాల వీరభద్రం, పెన్మెత్స రామకృష్ణరాజు పాల్గొన్నారు.

నేడు అలంపురంలో ఉచిత వైద్యసేవలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ సేవాధారిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 4న పలు విభాగాల నిపుణులైన వైద్యులతో ఉచిత వైద్యసేవలు నిర్వహించనున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎముకలు, కీళ్లు, నరాలు, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు పరీక్షలతో పాటు, జనరల్ సర్జన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తణుకులో 3 బార్లకు గెజిట్ నోటిఫికేషన్ జారీ

తణుకు అర్బన్: తణుకు పట్టణంలో మూడు బార్లకు దరఖాస్తులు స్వీకరణ కోసం ఎక్సైజ్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, 15న జిల్లా కలెక్టర్ సమక్షంలో బార్లకు డ్రా తీయబడునని చెప్పారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్స్ 9440902436, 9490874538 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డ్రోన్‌తో తక్కువ సమయంలో ద్రావణాల పిచికారీ



నందమూరులో డ్రోన్ సాయంతో కషాయాల పిచికారీ గురించి వివరిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రకృతి విధానంలో సాగు చేపట్టి డ్రోన్‌ల సాయంతో కషాయాలను తక్కువ సమయంలో పిచికారీ చేయవచ్చని ఏవీవో విద్యాసాగర్, ప్రకృతి వ్యవసాయం జోనల్ కోఆర్డినేటర్ గద్దె వెంకటరత్నం రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని నందమూరు గ్రామంలో ప్రకృతి విధానంలో పంటలు పండిస్తున్న రైతు క్షేత్రాల్లో సామూహికంగా డ్రోన్ సాయంతో కషాయాల పిచికారీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా స్వయంగా తయారు చేసిన కషాయాలు వినియోగించడం ద్వారా సాగులో ఖర్చు లు తగ్గించుకోవచ్చన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావు, డివిజన్ ఇన్‌చార్జ్ మరిడి కృష్ణ, కోనా శ్రీనివాస్, రైతులు ఆరుగొలను అప్పారావు, అడపా దానయ్య, బాలరాజు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పుంత రోడ్లు

- ఏళ్లు గడుస్తున్నా నిర్మాణానికి నోచుకోని పుంత రోడ్లు
- ప్రతిపాదనలకే పరిమితం... ఆచరణ శూన్యం
- రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు



అప్పారావుపేట - పుల్లాయగూడెం పుంత రోడ్డు దుస్థితి



మాధవరం - మోదుగగుంట పుంత రోడ్డు

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు తమ చేలకు, పశువుల మకాంలకు వెళ్లాలంటే ప్రధాన ఆధారం పుంత రోడ్లు. శివారు పొలాలకు వెళ్లేందుకు ఏ గ్రామంలోనూ పుంత రోడ్లు లేవు. దీంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో వారి అవస్థలు వర్ణనాతీతం. తాడేపల్లిగూడెం మండలంలో 25వేల ఎకరాల వరి ఆయకట్టు, ఉద్యాన పంటలైన ఆయిల్ పామ్ 3800 ఎకరాలు, కొబ్బరి 2,650 ఎకరాలు, అంతర పంటగా కోకో 4,250 ఎకరాలు, జామ 630 ఎకరాలు, మామిడి, జీడి మామిడి, బొప్పాయి, అరటి 300 ఎకరాలు, కూరగాయలు 150 ఎకరాలు వెరసి 13,280 ఎకరాల పంటలు సాగవుతున్నాయి. వరి, ఉద్యాన పంటలు మొత్తం దాదాపు 40వేల ఎకరాలు విస్తీర్ణం ఉంది. ఆయా పంటలను రైతులు చేల నుంచి గట్టుకు చేర్చుకోవాలన్నా, మార్కెట్‌కు తరలించాలన్నా సరైన పుంత రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరి ధాన్యాన్ని గట్టుకు చేర్చుకునే సందర్భంలో ట్రాక్టర్లు సైతం మట్టిలో కూరుకుపోయే పరిస్థితి వస్తుందంటూ పలువురు రైతులు వాపోతున్నారు. పండించిన పంటకు గట్టుకు చేర్చేందుకు రైతుకు చుక్కలు కనిపిస్తున్నాయని చెప్పక తప్పదు. దేశానికి అన్నం పెట్టే రైతు కనీస అవసరాలైన పుంత రోడ్లు నిర్మించలేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. గత ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెం మార్కెట్ కమిటీ పుంత రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది. అయితే, ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా పుంత రోడ్లను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత ప్రాతిపదికన పుంత రోడ్లు నిర్మించాలి

రైతాంగానికి ప్రధాన ఆధారం పుంత రోడ్లు. పంట తెచ్చుకోవాలన్నా..మార్కెట్‌కు చేర్చాలన్నా... పశువుల మకాంలకు వెళ్లాలన్నా పుంత రోడ్ల అవసరం ఎంతైనా ఉంది. రైతాంగానికి ఎంతో మేలు చేసే పుంత రోడ్లను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలి.

– ముళ్లపూడి రామకృష్ణ, రైతు, జగన్నాథపురం, తాడేపల్లిగూడెం మండలం

క్యాన్సర్ వ్యాధిపై వైద్య సిబ్బందికి శిక్షణ



తణుకులో క్యాన్సర్ వ్యాధిపై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి

తణుకు అర్బన్: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కలిగించే విధంగా వైద్యవర్గాలు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎన్‌సీడీ సీడీ 4.0 సర్వేలో భాగంగా బుధవారం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ అనుమానితులు, లక్షణాలు ఉన్న వారికి వెంటనే స్క్రీనింగ్ చేసి వ్యాధిని గుర్తించే పరిస్థితులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్‌లపై శిక్షణ ఇచ్చారు. డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీలక్ష్మి, జిల్లా ఎపిడేమోలజిస్ట్ గాతల సుభాష్, డాక్టర్ మౌనిక, డాక్టర్ భారతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాకర్లమూడి సాయికిరణ్, ఆర్ఎంవో డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావు, తణుకు నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లలకు గ్లోబల్ సపోర్ట్ సేవలు విస్తరణ



గ్లోబల్ సపోర్ట్ సేవా కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలకు గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు విస్తరిస్తామని నిర్వాహకురాలు త్రికళ చెన్న అన్నారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యకు అవసరమైన ఫిజియోథెరపీ బాల్స్, స్నాక్స్, విద్యా సామగ్రి అందజేశారు. త్రికళ మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు దాతలు సహాయ సహకారాలు తప్పక అందించాలని కోరారు.

భవిత సెంటర్‌లో దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ

భవిత కేంద్రంలో దివ్యాంగుల విద్యార్థులకు అకాడమిక్ స్కిల్స్, రైటింగ్, రీడింగ్ సిల్క్స్, నెంబర్, టైం, మనీ, లైఫ్ స్కిల్స్, కో-కర్క్యులర్ యాక్టివిటీస్ నేర్పించారు. దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. ఫిజియోథెరపీ డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించాలని, దివ్యాంగులలో సామార్థ్యాలు అభివృద్ధి చెందే విధంగాను, వారి పనులు వారు చేసుకునే విధంగా చూడాలన్నారు. తల్లిదండ్రులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఇరగవరం: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇరగవరం వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో పిల్లి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్మార్ట్ ఫోన్లు ఇచ్చి కార్మికులను కట్టు బానిసలుగా రాష్ట్ర ప్రభుత్వం పని చేయిస్తుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకుండా కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారంతోపాటు కనీస వేతనం అమలు చేసేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ కార్మికుల ఐక్యత సంఘానికి బలం అని తెలిపారు. ఈ సమావేశంలో వీవోఏల జిల్లా నాయకులు గడ్డం లక్ష్మి, మండలంలోని పలువురు వివోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



తేతలిలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తండ్రి జ్ఞాపకార్థంగా పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందచేయడం అభినందనీయమని డీవైఈవో డి.మురళీ సత్యనారాయణ అన్నారు. తణుకు మండలం తేతలి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాపతు మదన గోపాలరెడ్డి, తణుకు మునిసిపల్ నంబరు 4ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా విధుల్లో ఉన్న రుద్రమదేవి దంపతులు తండ్రి బాపతు చెన్నారెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పాఠశాలల్లో 13 మంది పేద, మెరిట్ విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవైఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ఉన్న పాఠశాలలో పేద విద్యార్థులకు సైకిళ్లు గత 12 సంవత్సరాలుగా అందిస్తున్నారంటే వారికి ఉన్న విలువలు ఏపాటివో అర్థమవుతోందని అన్నారు. తండ్రి చేసిన దానధర్మాలను కుమారుడు కూడా వారసత్వంగా స్వీకరించి ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం మంచి పరిణామమని అన్నారు. ఈ సందర్భంగా గోపాలరెడ్డి దంపతులను ఉపాధ్యాయులతో పాటు తేతలి గ్రామ నాయకులు సరెళ్ల సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు. ఆంజనేయులు, పాఠశాల హెచ్ఎం కోట సూర్య వెంకట విశ్వేశ్వరప్రసాద్, ఉపాధ్యాయులు కె.పుల్లారెడ్డి, జె.రాజకుమారి, స్వతంత్రభారతి తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



కడకట్ల వద్ద కల్వర్టు లేని డ్రెయిన్



స్థానిక ఆదిత్య కళాశాల వద్ద కల్వర్టు



స్థానిక ఏడోవ వార్డులో కల్వర్టులు



రైల్వే స్టేషన్ రోడ్డులో కల్వర్టు

- ప్రమాదకరంగా పట్టణంలో కల్వర్టులు
- తక్షణమే స్పందించాలని కోరుతున్న ప్రజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కల్వర్టులు అనేక ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా ప్రాంతాలలో కల్వర్టులలో ఉన్న ఇనుప ఊసలు పైకి వచ్చి ఆదమరిచి వాటిపై ప్రయాణం చేస్తే అంతే సంగతులు అన్న చందంగా ఉన్నాయి. కొన్ని చోట్ల డ్రెయిన్ మార్గాలపై కల్వర్టులు డ్రెయిన్‌లు కంటే దిగువన ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలని, పాడైన చోట్ల కల్వర్టులు కొత్తవి ఏర్పాటు చేయాలని, లేని చోట్ల కల్వర్టులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని వార్డులలో ఇదే పరిస్థితి:

పట్టణంలో ఇంచుమించుగా అన్ని వార్డులలోనూ ఆయా ప్రాంతాలలోని డ్రెయినేజీలకు ఉన్న చాలా కల్వర్టులు ప్రమాదకరంగా మారి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇంకా అనేక ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్‌లు ఏర్పాటు చేయడం, వాటికి కల్వర్టులు అమర్చడం జరగాల్సి ఉండగా ఎప్పటి నుంచో ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. కల్వర్టులు పాడవ్వడంతో, సీసీ రాళ్లు పాడి పాడి అయ్యిపోవడంతో కల్వర్టులకు ఉన్న ఇనుప ఫ్రేమ్‌లు బయిటకు పొడుచుకొని వస్తున్నాయి. ఇనుప ఫ్రేమ్‌లు గుండా వాహనాలు వెళ్లే సమయంలో వాహనదారులు ఇక్కట్లు వర్ణణాతీతంగా మారింది.

ఎగుడు, దిగుడులతో కల్వర్టులు:

డ్రెయినేజీలలోని మురుగనీరు సరైన మార్గంలో ప్రయాణించేందుకు వీలుగాను, రోడ్లపై ప్రయాణించే వారికి డ్రెయిన్ మార్గాలు అడ్డంకి లేకుండా ఉండేందుకు వీలుగా కల్వర్టులు నిర్మాణం చేశారు. ఈ క్రమంలో రోడ్డులు ఎత్తుగా మారిన సమయంలోను, కల్వర్టులు అదే స్థాయిలో ఎత్తు పెంచకపోవడం, అదే విధంగా రోడ్లు దిగువులో ఉన్న ప్రాంతాలలో కల్వర్టులు ఎత్తుగా మారి ఉండటంతో అటు డ్రెయిన్ మార్గాలకు, ఇటు ప్రయాణీకులకు, ప్రజలు అనేక ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడినప్పుడు కల్వర్టులు గుండా నీరు ప్రవహించడం లేదు. బురద నీరు రోడ్డుపైకి ప్రవహిస్తుంది.

ముందుకు సాగని డ్రెయిన్ మురుగు నీరు:

కల్వర్టులు డ్రెయిన్ కంటే దిగువన ఉండటంతో డ్రెయిన్‌లోని మురుగు నీరు ముందుకు సాగడం లేదు. చాలా ప్రాంతాలలో డ్రెయిన్‌లు పొంగి రోడ్లపైకి మురుగు నీరు చేరుతున్నాయి. పలు ప్రాంతాలలో కల్వర్టులు శిథిలం కావడంతో డ్రెయిన్‌లోకి కల్వర్టులు కూరుకుపోవడం, ఈ క్రమంలో డ్రెయిన్ మార్గాలు మూసుకుపోతున్నాయి. డ్రెయిన్‌లలో వ్యర్థాలు ఎక్కడవి అక్కడ నిలిచి ఉండటంతో వ్యర్థాలు కారణంగా దుర్వాసన వెదజల్లుతుంది. ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు దుర్వాసన కారణంగా ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. దీనికి తోడు డ్రెయిన్‌లలో నీరు కదలకపోవడంతో దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా అవి మారుతున్నాయి.

పలు చోట్లు కల్వర్టుల దుస్థితి:

రాళ్ల మధ్యలో ఖాళీలు ఏర్పడటం, నాసి రకం సీసీ కల్వర్టులు కారణంగా ఊచలు విరిగి సూదులు తరహాలో అవి గుచ్చుకోవడం, గొయ్యిలు ఏర్పడటం, రాళ్లు ప్రక్కకు జరగడం, తదితర కారణాలు వల్ల ఆవి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ కల్వర్టులు మీదుగా ద్విచక్ర వాహనదారులు ఆదమరిచి ప్రయాణం చేస్తే టైర్లు పంక్చర్‌లు కావడం, ప్రమాదాలు జరగడం తప్పదని చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాలలో కల్వర్టు వద్ద గొయ్యి ఉన్నది లేనిది తెలియకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు లోనైన ఘటనలు ఉన్నాయిని ఆయా ప్రాంతాల స్థానికులు వాపోతున్నారు. పగటి పూట కూడా వేగంగా వచ్చే వాహనచోదకులు సైతం కల్వర్టు వద్దకు వచ్చే సరికి బ్రేక్ వేసే సమయానికి ఆలస్యమై ప్రమాదాలు భారీన పడుతున్నారు.

కల్వర్టులు కారణంగా గాయాలు పాలవుతున్నాం



వివిధ ఇబ్బందికర స్థితిలో ఉన్న కల్వర్టుల కారణంగా వాహనచోదకులు తరుచుగా గాయాలు పాలవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ ప్రమాదాలు మరీ ఎక్కువగా ఉన్నాయి. కల్వర్టులను శాశ్వతప్రాతిపదికన నిర్మించాలి. నాసిరకం కల్వర్టులు ఎక్కువ కాలం ఉండటం లేదు. భవిష్యత్తు తరాలకు పనికి వచ్చే కల్వర్టులను నిర్మించాలి. సంబంధిత అధికారులు స్పందించాలి.

–ఎ.వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం

5న డీఆర్‌జీలో ఉపాధ్యాయ దినోత్సవం

పెంటపాడు: ఈనెల 5న పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు మానవత జిల్లా నాయకులు తాడేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెంటపాడు మానవత శాఖ, మానవతా సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తప్పక హాజరుకావాలని మోహనరావు కోరారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తన సిబ్బందితో బుధవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.8,150లు నగదు, ఒక కోడిపుంజు, మూడు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రసాద్ వివరించారు. కేసు నమోదు చేశారు.

రెండో విడత బార్ నోటిఫికేషన్ విడుదల

తాడేపల్లిగూడెం: పట్టణ పరిధిలో మొదటి విడతలో ఓపెన్ కేటాగిరిలో భర్తీ కాకుండా మిగిలిన 4 బార్లును లాటరి ద్వారా ఏర్పాటుకు బుధవారం రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేశారు. నాలుగు బార్లకు నిమిత్తం 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు లాటరి నిమిత్తం దరఖాస్తులు స్వీకరించనున్నారు. 15వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి కొత్త బార్లు కేటాయించనున్నట్లు సీఐ ఈ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సరస్వతి



ఇరగవరం జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: గర్భస్థ దశలో లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని సీడీపీవో టీఎల్. సరస్వతి హెచ్చరించారు. బుధవారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో పీసీపీఎన్‌డీటీ-1994, పీఎంఎంవీవై పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల శారీరక సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. యుక్త వయస్సు వచ్చిన తర్వాతే బాలికలకు వివాహాలు చేయాలన్నారు. ప్రభుత్వాసుపత్రి ప్రసవాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలన్నారు. అలాగే, బాలికలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలని కోరారు. అనంతరం నోరు, రొమ్ము, సెర్వైకల్ క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.ఎస్తేరు రాణి, కే.వి శాలాక్షి, జి.బేబి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ఇరగవరం: మహిళలపై చట్టాలపై అవగాహన అవసరమని సీడీపీవో శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలోని ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గురువారం మిషన్ శక్తిలో భాగంగా మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ గర్భిణులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి వారు ఎప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవరైనా నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నా, చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణులు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్లు మాణిక్యంబ, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులో ఆకస్మిక తనిఖీలు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పోలీస్ అధికారి డి.విశ్వనాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎరువులను ఎంఆర్‌పీకి మించి అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి దుకాణాలను సీజ్ చేస్తామని, డీలర్లపై క్రిమినల్ చర్యలు ఉంటాయని చెప్పారు. బస్తా విక్రయానికి రైతులకు రసీదు ఇవ్వాలని, ధర, బరువు వివరాలను స్పష్టంగా ఉండాలన్నారు. ఎవరైన అటువంటి చర్యలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనిఖీలలో డీఎస్పీ, టౌన్ సీఐ బీ ఆదిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బలుసులమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బలుసులమ్మ అమ్మవారి దసరా మహోత్సవ శుభ పత్రిను బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. దసరా అన్నదానం నిమిత్తం రూ. 9,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండపాక పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు

తణుకు అర్బన్: తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ హైస్కూలు 2024-25 విద్యా సంవత్సరానికిగాను క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ఫణిశ్రీ తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలకుగాను ఈ అవార్డు దక్కిందని చెప్పారు.